క్లుప్తంగా

మీ సేవ కేంద్రం తనిఖీ



తిరుమలగిరిలో మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌ఐ సుజిత్ రెడ్డి

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని మీ సేవ కేంద్రాన్ని మంగళవారం ఆరే సుజిత్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీసేవ కేంద్రాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే తీసుకోవాలని అన్నారు. నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫణిగిరిలో మిస్ వరల్డ్ హెరిటేజ్ వాక్ నిర్వహించాలి

నాగారం : ఫణిగిరి బౌద్ధ క్షేత్రంలో మిస్ వరల్డ్ హెరిటేజ్ వాక్ నిర్వహించాలని బోధిసత్వ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులిగిల్ల వీరమల్లు యాదవ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించే అందాల పోటీలలో పాల్గొనే 140 దేశాల ప్రపంచ సుందరీమణులు మిస్ వరల్డ్ హెరిటేజ్ వాక్‌లో భాగంగా యాదగిరిగుట్ట, నాగార్జునసాగర్ బుద్ధవనం, వరంగల్ రామప్ప టెంపుల్‌ను సందర్శించనున్నారని తెలిపారు. అలాగే ఫణిగిరి బౌద్ధ క్షేత్రంలో కూడా హెరిటేజ్ వాక్ నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు బోధిసత్వ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు



రామకోటి స్తూపం వద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం సూర్య క్షేత్రం ఆవరణలో ఉన్న కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయంలో మంగళవారం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, గంధసింధూరం, తమలపాకుల పూజ, మంగళశాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష

మోతె : మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మంగళవారం మోతె తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో తహసీల్దార్ బి. శ్రీకాంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఏయే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి, తదితర అంశాలపై అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారి అరుణ, ఏపీఎం వెంకయ్య, ఏఈఓలు, ఐకేపీ సీసీలు, పోలీసులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో ఇటీవల రిటైర్డ్ ఉద్యోగులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పద్యాలు, క్రీడా సాహిత్య సాంస్కృతిక పోటీల్లో రిటైర్డ్ ఉపాధ్యాయుడు, రిటైర్డ్ ఉద్యోగుల కౌన్సిల్ సభ్యుడు పొట్టా జగన్‌మోహన్‌రావు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీ ప్రజలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బొడ్డు వీరయ్య, మట్టపల్లిరావు, కస్తూరి రాములు, కేతిరెడ్డి రాంరెడ్డి, బెల్లంకొండ గోవర్ధన్, రామినేని సత్యనారాయణ, చామర్తి బ్రహ్మం, గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి, డోర్నిస్, చంద్రం, వెంకటరాంరెడ్డి పాల్గొన్నారు.

జాతరలో విక్రయాలకు వేలం



వేలంపాటలో పాల్గొన్న అధికారులు

చివ్వెంల : మండల పరిధిలోని పులితండాలో ఏప్రిల్ 10, 11 తేదీల్లో జరిగే చాంపూలాల్ జాతరకు సంబంధించి కొబ్బరికాయాల విక్రయాలు, తలనీలాల నిర్వహణకు అధికారులు మంగళవారం వేలంపాట నిర్వహించారు. తలనీలాల నిర్వహణను ఆంధ్రప్రదేశ్‌లోని ఎలూరుకు చెందిన జగన్నాథం కాటయ్య రూ.28 వేలకు కైవసం చేసుకున్నాడు. కొబ్బరి కాయల విక్రయాన్ని జాన్‌పహాడ్‌కు చెదిన బానోతు సైదా రూ.31 వేలకు దక్కించుకున్నాడు. బొంగులు, పేలాలు, మిఠాయిల అమ్మకాలకు సరైన ధర రాకపోవడంతో ఈనెల 28 వతేదికి వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రాజశేఖర్, ఎంపీఓ దయాకర్, పంచాయితీ కార్యదర్శులు స్రవంతి, గ్రీష్మ, అరవింద్, సైదులు, విక్రమ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పశువుల షెడ్ల నిర్మాణం

- జాజిరెడ్డిగూడెం మండలానికి 66 మంజూరు కాగా 45 నిర్మాణాలు పూర్తి
- ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.83 వేలు

అర్వపల్లి : ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పూర్తి సబ్సిడీతో పశువుల పాకలు నిర్మిస్తున్నారు. జాబ్ కార్డుతో పాటు పశువులు ఉంటే ఈ పథకానికి అర్హులు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ. 83 వేలు అందిస్తున్నారు. మండల వ్యాప్తంగా షెడ్డుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

45 నిర్మాణాలు పూర్తి..

జాజిరెడ్డిగూడెం మండలానికి ఈ విడతలో 66 పాకలు మంజూరుకాగా మండంలోని వివిధ గ్రామాలలో 45 షెడ్డుల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటి పనులు జరుగుతున్నాయి. కాగా ఈ షెడ్డు పక్కనే పశువులు తాగటానికి నీటి తొట్లను కూడా నిర్మిస్తున్నారు. ఈ తొట్లతో పశువులకు నీటి ఇబ్బంది తీరనుందని రైతులు చెబుతున్నారు. మొదటి విడతలో మంజూరైన నిర్మాణాలు పూర్తయితే మరోమారు షెడ్లు మంజూరుకు అవకాశం ఉంటుంది.



లోయపల్లిలో నిర్మించిన పశువుల షెడ్డు



అడివెంలలో ...

పశువుల షెడ్డు నిర్మించుకున్నా



ఉపాధిహామీ పథకం నిధులతో పశువుల షెడ్డును నిర్మించుకున్నాను. దీంతో పశువులకు నీడ ఏర్పడింది. అలాగే పశువులు నీళ్లు తాగటానికి నీటి తొట్టిని కూడా నిర్మించారు.

\- గెండెల యశోద, లోయపల్లి

పనులు జరుగుతున్నాయి



ఉపాధిహామీ నిధులతో 66 పశువుల పాకలు మంజూరు కాగా 45 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటి పనులు జరుగుతున్నాయి. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.80వేల పైగానే చెల్లిస్తున్నాం.

\- సీహెచ్ ఉపేందర్, ఏపీఓ

నేడు మాజీ ఎంపీ ధర్మభిక్షం వర్ధంతి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భానుపురి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ ధర్మభిక్షం 14వ వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ధర్మభిక్షం విగ్రహం వద్ద వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా, మూడు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నికై చట్టసభలలో గళం విప్పిన మహనీయుడు ధర్మభిక్షం అన్నారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా తుపాకి చేతబట్టి అన్యాయానికి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి అని చెప్పారు. ఈ వర్ధంతికి కార్మికులు, కర్షకులు, మేధావులు, అభిమానులు, గీత కార్మికులు, పార్టీ శ్రేణులు, యువజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, నిమ్మల ప్రభాకర్, దేశగాని హేమలత, అయితగాని కామేష్ పాల్గొన్నారు.

గుంతలమయంగా ప్రధాన రహదారి

- మద్దిరాల – ముకుందాపురం రోడ్డులో అడుగడుగునా గుంతలు
- నూతన రోడ్డు నిర్మాణం కోసం ప్రయాణికుల ఎదురుచూపు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



గుంతలమయంగా ఉన్న ముకుందాపురం-మద్దిరాల ప్రధాన రహదారి

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రం నుంచి ముకుందాపురం వెళ్లే ప్రధాన రహదారి (బీటీరోడ్డు) గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, ఆటోలతోపాటు భారీ వాహనాలు తరచుగా వెళ్తుండటం వల్ల రోడ్డుపై గుంతలు ఏర్పడాయి. ఈ గుంతల వల్ల ఇప్పటికే చాలా ప్రమాదాలు చోటు చేసుకున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ముకుందాపురం, జి.కొత్తపల్లి, మామిండ్లమడవ, తూర్పుతండా, చిన్ననెమిల, చందుపట్ల గ్రామాల ప్రజలు మండలకేంద్రానికి తరచుగా వివిధ పనుల నిమిత్తం వస్తూ ఉంటారు. కానీ గుంతలమయంగా ఉన్న రోడ్డుపై వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మరిపెడ బంగ్లా, ఖమ్మం వెళ్లడానికి షార్ట్‌కట్ కావడంతో చాలా మంది ఈరూట్‌లోనే ప్రయాణాలు సాగిస్తుంటారు. కానీ ఈరోడ్డుపై గుంతలు, మూలమలుపులు ప్రమాదకరంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2023 మే నెలలో అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఎమ్‌ఆర్‌ఆర్ నిధులతో మద్దిరాల నుంచి ముకుందాపురం వరకు బీటీరోడ్డు మంజూరు చేసి శంకుస్థాపన కూడా చేశారు. ఈలోపు ప్రభుత్వం మారడంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తోంది. అధికారులు స్పందించి నూతన రోడ్డును ఏర్పాటు చేసి ప్రయాణికుల రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలు



మద్దిరాల -ముకుందాపురం ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల కారణంగా చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలి.

\- జనగామ దానయ్య, ముకుందాపురం

నిబంధనల ప్రకారమే అనుమతి ఇవ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేటటౌన్: ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే హాస్పిటళ్ల నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహించుటకు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం తగిన అర్హత గల డాక్టర్స్‌కు మాత్రమే అనుమతి ఇవ్వాలని చెప్పారు. ఒకరి పేరుతో పర్మిషన్ తీసుకుని మరొకరు వైద్యం నిర్వహించడాన్ని పూర్తిగా ఖండించి, తగిన చర్యలు తీసుకొని హాస్పిటల్స్‌ను మూసివేయాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ రెన్యువల్ అవసరమైన వారు 30 రోజుల ముందు అప్లై చేసుకోవాలన్నారు. వీరు అవసరమైన అన్ని డాక్యుమెంట్లు సమర్పించినట్లయితే 45 రోజులలోపు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వబడుతుందని తెలిపారు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్ పొందిన తరువాత రెన్యువల్ గడువు తేదీకి 90 రోజులు ముందుగా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. సకాలంలో రెన్యువల్ చేయించుకోకపోతే పెనాల్టీ కట్టాల్సి వస్తుందన్నారు. సమావేశంలో మట్టయ్య, డాక్టర్ ఆనంద్, కె.మనోహర రాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని వినతి



తిమ్మాపురంలో అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతూ మంగళవారం గ్రామానికి వచ్చిన అదనపు కలెక్టర్ రాంబాబుకు అంగన్‌వాడీ టీచర్లు జీడి రాధ, బొడ్డు పరమేశ్వరి వినతిపత్రం అందజేశారు. రెండు కేంద్రాలకు కొంతకాలంగా ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీచేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలపై నేడు కలెక్టరేట్ ముట్టడి



మాట్లాడుతున్న రణపంగ కృష్ణ

పెన్‌పహాడ్ : ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం లింగాల గ్రామంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వెంటనే వాటిని పరిష్కరించాలని కోరారు. పెన్‌పహాడ్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ పరిధిలో ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ. 30వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాములు, అనిల్, లొడంగి మధు, సుజాత, దుర్గయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : స్థానిక సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం కోసం అధికారులు విఫలమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొజ్జ శ్రీనివాస్, తొట్ల లింగయ్య, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పొలాల్లో రైతుల నిరసన



సింగారంతండాలో నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు, నాయకులు

తుంగతుర్తి : ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల పరిధిలోని సింగారంతండాలో ఎండిన పంటల వద్ద గిరిజన రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. సింగారంతండాను పైలట్ గ్రామంగా గుర్తించి రెండు నెలలు అవుతున్నా ఇంతవరకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు వల్ల ఎకరాల కొద్ది యాసంగి పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఎన్నికల ముందు మహిళలకు, వృద్ధులకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు, కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం అమలు చేయలేకపోయిందని అన్నారు. ఇలాంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మ శంకర్‌నాయక్, నాయకులు చెన్ను నాయక్, నాగునాయక్, రమేష్ నాయక్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక.. ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న తహసీల్దార్ లాలు

పెన్‌పహాడ్ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫార్ విందు ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక అని తహసీల్దార్ లాలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మజీద్‌లో ప్రభుత్వం ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. 150మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్, గులాం, సైదులు, ఖాసీం పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



డి.కొత్తపల్లిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నాగారం : భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా మంగళవారం డి.కొత్తపల్లి గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరి కంబమెక్కిన భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, మాజీ సర్పంచ్ యానాల సుధాకర్ రెడ్డి, సంపెట కృష్ణమూర్తి, దందోలు ధనుంజయ్, కళింగారెడ్డి, లింగారెడ్డి, నాతి ఉప్పలయ్య, కదారి సైదులు, కోడికంటి శ్రీను, సోమన్న, ఆవుల శ్రీను, బోలాగని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ ధ్యానం చేయాలి

నడిగూడెం : ప్రతిరోజూ ధ్యానం చేయాలని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో కొనసాగుతున్న ధ్యానంపై అవగాహన కార్యక్రమంలో మంగళవారం వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం గురించి మరచిపోతున్నారని అన్నారు. జీవనశైలిలో మార్పులతో అనేక రకాల జబ్బులు సోకుతున్నాయని తెలిపారు. నిత్యం శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండవ వెంకటేశ్వరరావు, భవురిశెట్టి వెంకటరత్నం, మోత్కూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ



చిలుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో కలిసి ప్రార్థన చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిలుకూరు : విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్, ఎస్పీ నరసింహ అన్నారు. మంగళవారం చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలను ఉదయం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థనలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారు.. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది.. పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను వారు అడిగి తెలుసుకున్నారు. అన్ని సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థులు తెలపడంతో పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఎంఎంఎస్‌లో ప్రతి ఏడాది జిల్లా ర్యాంక్‌లతో పాటు పది మంది విద్యార్థులు ఎంపికవుతున్నారని తెలియజేయడంతో ఉపాధ్యాయులను కలెక్టర్, ఎస్పీ అభినందించారు. పాఠశాలలో మన ఊరు – మన బడి కింద మంజూరైన గదుల నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు రాజారాం, కైలాసం వెంకటేశ్వర్లు, గుండు ఆదినారాయణ, రామారావు, కోదండ రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : జలసంరక్షణతో పాటు వివిధ అంశాలపై మండలంలోని తిమ్మాపురం గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మంగళవారం కళాప్రదర్శన నిర్వహించారు. వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి సంరక్షణతో పాటు వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారథి జిల్లా టీం లీడర్లు పల్లెల లక్ష్మణ్, పాలకుర్తి శ్రీకాంత్, కళాకారులు గడ్డం ఉదయ్, వీర్ల సైదులు, మేడిపల్లి వేణు, పాక ఉపేందర్, రామలక్ష్మణ్, మంజుల, స్రవంతి, రాధ, శిరీష, భిక్షపతి, శ్రవణ్, నాగలక్ష్మి, ప్రియాంక, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



నాగారం : పనులను ప్రారంభిస్తున్న నాయకులు



అర్వపల్లిలో..

అర్వపల్లి : మండలంలోని రామన్నగూడెంలో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ నిధులతో గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలలో అవసరమైన చోట సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పారిశుద్ధ్య సమస్య తీరనుందని చెప్పారు.

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరిలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో గ్రామంలోని శివాలయం రోడ్డు నుంచి సీతారామచంద్రస్వామి ఆలయం వరకు సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గట్టు నర్సింహారావు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిగిళ్ల వీరమల్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అర్వపల్లి : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్ అన్నారు. ఎమ్మెల్యే సామేల్ సహకారంతో మంజూరైన నిధులతో అర్వపల్లిలో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామ గ్రామాన సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బైరబోయిన సైదులు, సీనియర్ నాయకుడు బైరబోయిన మహరాజు, మాజీ సర్పంచ్ సునీతరామలింగయ్య, అలువాల వెంకటస్వామి, పులిచర్ల ప్రభాకర్, వీరయ్య, మహేష్, రాంబాబు, కోటిప్రసాద్, మనోహర్, వినయ్, ధోని, ప్రభు తదితరులు, పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే..



పగిలిన స్లాబ్ బిల్లలు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మల్లీశ్వరి థియేటర్‌కి వెళ్లే బజారులో జాతీయ రహదారి వెంబడి డ్రెయినేజీ స్లాబ్ బిల్లలు పగిలిపోయాయి. ఈ దారిలో బాటసారులు, విద్యార్థులు, థియేటర్‌కి వెళ్లే ప్రజలు వెళ్తుంటారు. స్లాబ్ పగిలి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి స్లాబ్ బిల్లలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ వార్షికోత్సవం

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం సాగర్ ఎడమ కాల్వ కట్టపై గల నాంచారమ్మ, యల్లమ్మ ఆలయ తొలి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణం జరిపారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడితే నిర్బంధించడం సరికాదు



మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

కోదాడరూరల్ : హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలను నిర్బంధించడం సరికాదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌రాజు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్‌లో హక్కుల కోసం పోరాడుతున్న రైతులపై, శంబూరి ప్రాంతంలో వేసుకున్న గుడారాలపై బుల్డోజర్‌లతో తొక్కించి వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు తరహా పోకడలతో దేశ ప్రజలను నియంతృత్వ పద్ధతిలో పాలించాలనుకుంటుందని ఆయన విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే రద్దు చేయాలని వచ్చే నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, ఉదయగిరి, నవీన్, శ్రీను, రవి పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయి జెడ్పీ ఉన్నత పాఠశాలకు జగ్గునాయక్‌తండాకు చెందిన బాణోతు సుధాకర్ తన తండ్రి సైదానాయక్ జ్ఞాపకార్థం రూ.14వేల విలువ చేసే బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా దాతను హెచ్ఎం హరికిషన్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాజిద్, అంజయ్య, యజ్ఞాని, లక్ష్మి, మస్తాన్, ఆడమ్, శేఖర్, గంగా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

కోదాడ : కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఈదుల కృష్ణయ్యయాదవ్ అన్నారు. మంగళవారం కోదాడలో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. కులగణన చేపట్టి బీసీలకు తగిన న్యాయం చేశారని, బీసీలు కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో పెరిక సంఘం రాష్ట్ర నాయకుడు రామినేని శ్రీనివాసరావు, ముదిరాజ్ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు ముసి శ్రీనివాస్‌ముదిరాజ్, గౌడ సంఘం నాయకుడు మట్టపల్లి శ్రీనివాసగౌడ్, యాదవ సంఘం నాయకుడు చిమట శ్రీనివాసరావు, దళిత సంఘం నాయకుడు మందా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.